క్లుప్తంగా

మొగిలిలో ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చిత్తూరు అర్బన్: చిత్తూరుకు చెందిన ఇద్దరు కూలీలకు ఓ సెల్‌ఫోన్ దొరకడంతో దాన్ని నిజాయితీగా పోలీసులకు అప్పగించారు. సోమవారం ఉదయం తాపీ మేస్త్రీ కూలీగా పని చేస్తున్న అముద, గోవిందన్‌కు నగరంలో ఓ సెల్‌ఫోన్ దొరికింది. దీన్ని వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డికి అప్పగించారు. ఫోన్ పోగొట్టుకున్న ఉదయ్ అనే యువకుడిని పిలిపించిన సీఐ, ఫోన్‌ను అతనికి అందచేశారు. అముద, గోవిందన్‌ను సీఐ అభినందించారు.

యూనివర్సిటీ విద్యార్థులతో లిప్ కార్యక్రమాల పరిశీలన

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేయబోయే లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాలు యూనివర్సిటీ విద్యార్థులు పరిశీలించనున్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసులురెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఫౌండేషనల్ లిటరసీని పెంపొందించేందుకు లిప్ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ విద్యార్థులు ప్రతి శనివారం సందర్శిస్తారని పేర్కొన్నారు. జిల్లా సమగ్రశిక్ష అధికారులు పకడ్బందీగా కార్యక్రమం అమలు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

యాదమరి (పూతలపట్టు): డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు సహకారం అందించాలని చిత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారు కనబడితే వెంటనే 14500 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఈహెచ్‌ఎస్ కార్డుల సమస్యలు పరిష్కరించరూ!

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి



మంత్రిని కలిసిన ఆపస్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగుల ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్) కార్డుల సమస్యలను పరిష్కరించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజి కోరారు. సోమవారం ఆ అసోసియేషన్ నాయకులు విజయవాడలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను నివేదించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విలేకరులతో మాట్లాడారు. ఈహెచ్‌ఎస్ కార్డు సమస్యలను పరిష్కరించి ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కలిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ఆసుపత్రులలో ఈహెచ్‌ఎస్ వైద్య సదుపాయానికి అనుమతించడం లేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని సమాంతరంగా శాశ్వతంగా కొనసాగించాలన్నారు. మెడికల్ బిల్లులు అప్‌లోడ్ చేయడంలో ఉండే కాలపరిమితిని ఆరు నెలల నుంచి సంవత్సరానికి పెంచాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లో ప్రస్తుతం ఉన్న సీలింగ్ అమౌంట్ రెండు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచాలన్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లోని ప్రధాన ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యసేవలు, చికిత్స కల్పించాలని, అలాగే 45 ఏళ్ల దాటిన ఉద్యోగులకు ప్రతి ఏటా మాస్టర్ హెల్త్ చెకప్ చేసుకునేలా అవకాశం కల్పించాలన్నారు. ఈహెచ్‌ఎస్ విధానంలో ఆసుపత్రిలో అడ్మిట్ అయిన 12 గంటల్లోపు ఆమోదం ఇవ్వాలని కోరారు. సమస్యలను సావధానంగా విన్న మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఆపస్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఇతర నాయకులు శ్రావణ్ కుమార్, సురేశ్ కుమార్, రఘునాథ్ పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు
- తీగలు, పెట్టెల మరమ్మతులు తప్పనిసరి
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట



వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన ఫ్యూజులు

బంగారుపాళెం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రైతులు పంటలకు నీరు పెట్టడానికి వెళ్లి పొరపాటున విద్యుత్‌షాక్‌కు గురయ్యే ఆస్కారం ఉంది. కొందరు బోర్లు, మోటార్లకు మరమ్మతు చేసే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. పొలాల్లో తెగిపడిన విద్యుత్‌తీగలు, కిందకు వేలాడుతున్న తీగల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇళ్ల వద్ద, పంటపొలాల్లో విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో విద్యుత్, బోరుబావులు, వాగుల వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగుచేస్తున్నారు. విద్యుత్ వినియోగంలో ఏచిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈదురుగాలులు ఎక్కువగా వీచే అవకాశం ఉండడంతో జీవాలను మేతకోసం పొలాల్లోకి తోలుకెళ్లే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో శాఖ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. జ

మూడింటికే పరిహారం

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తాయి. మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందుతుంది. గాయాలకు పరిహారం ఉండదు. మనుషులకు అయితే రూ.5 లక్షలు, పశువులకు అయితే రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.7 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తారు. ఏదైనా ప్రమాదం జరిగిన స్థలంలోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకైతే ఫొటోతో పాటు పశువైద్యుడి పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది.

నష్టపరిహారం ఇలా..

- విద్యుత్ తీగలు తెగిపడినప్పుడు వాటికి తగిలి మనుషులు, పశువులు మరణిస్తే నష్టపరిహారం ఇస్తారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వాటికి తగిలి చనిపోతే నష్టపరిహారం అందుతుంది.
- తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడితే నష్టపరిహారం ఇస్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ పనులు సొంతంగా చేసుకోరాదు.
- తడి చేతితో విద్యుత్ పరికరాలను ముట్టుకోకూడదు.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే కరెంటు ఉండదని మరమ్మతులు చేయకూడదు.
- మోటార్లను నేలపై కాకుండా ప్రత్యేక దిమ్మలను ఏర్పాటు చేసుకోవాలి
- స్టార్టర్ బోర్డును తడవకుండా చూడాలి.
- మోటారు పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి. స్వంతంగా ప్రయత్నించరాదు.
- స్టార్టర్ వైర్లు నేలపై ఉంచరాదు. స్టార్టర్‌పై మూడ తీసి వాడకూడదు.
- సర్వీసు వైర్లను, మోటార్లకు వాడే తీగలు నాణ్యమైనవి వాడాలి. అతుకులు లేకుండా చూడాలి.
- సబ్ మెర్సిబుల్ మోటారుతో పాటు విద్యుత్ వైరు ఉంటుంది. ఏ కొంచెం వైరు తెగి ఉన్నా మోటార్ నుంచి పైన ఉండే వస్తువులకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి పొడవైన కర్ర, ప్లాస్టిక్ పైప్‌తో వ్యక్తిని తప్పించాలి. తగిన వైద్యసాయం అందించాలి.

ప్రమాదాలు ఇలా..

వర్షాకాలంలో పెనుగాలుల కారణంగా విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోయి కరెంటు సరఫరా అవుతుండడంతో పశువులు, ప్రజలు షాక్‌తో మృతి చెందుతున్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లినప్పుడు అక్కడ సరైన వైరింగ్ లేక ఏమరుపాటుతో ప్రమాదాల బారినపడుతున్నారు. డిస్ట్రిబ్యూషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమతి లేకుండా ఫ్యూజులు మార్చే క్రమంలో కరెంటు సరఫరా కావడంతో పలువురు చనిపోయిన సంఘటనలూ ఉన్నాయి. సర్వీసు వైర్లు, వీధి దీపాలను సరిచేసేందుకు విద్యుత్ స్తంభాలు ఎక్కినప్పుడు కరెంటు సరఫరా జరిగి మృతిచెందిన సందర్భాలు ఉన్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రతిఒక్కరూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాల బారిన పడకుండా ట్రాన్స్‌కో అధికారులు సూచిస్తున్న జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ తీగలు తెగిపడినట్లు గుర్తిస్తే వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. గుర్తింపు పొందిన ఎలక్ట్రీషియన్లతోనే రైతులు విద్యుత్ పనులు చేయించుకోవాలి. ఆన్ ఆఫ్ స్విచ్‌లు వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

–రామిరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ, బంగారుపాళెం

మళ్లీ మంచి రోజులొస్తాయి



చిత్తూరు రూరల్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

- ఎవరూ అధైర్యపడొద్దు
- మరో నాలుగు నెలల్లో అధినేత కలుస్తారు
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి



గుడిపాల నాయకుల సమావేశంలో..

చిత్తూరు కార్పొరేషన్: ''కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటాం..ఎవరూ అధైర్యపడొద్దు..ప్రజల మధ్యనే ఉందాం..సమస్యలపై ప్రజల పక్షాన పోరాడుదాం..మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయి..'' అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పార్టీ శ్రేణులకు ధైర్యవచనాలు పలికారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో గుడిపాల, రూరల్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో పార్టీ ఓటమిని తలచుకుంటూ కృంగిపోరాదన్నారు. కూటమి నేతలు పలు వాగ్దానాలను ఇచ్చి అధికారంలో వచ్చారని, అవి ఎంతవరకు నెరవేరుస్తారో చూడాలన్నారు. మూడు పార్టీలు జతకట్టినా తమ పార్టీ ఓటు బ్యాంకును రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతానికి తగ్గించలేకపోయారన్నారు. ప్రధానంగా అందరి కష్టాలు, సాధక బాధలు తెలుసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తల్లిలాంటి పార్టీని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసుకుంటూ ఐక్యంగా ఉంటామన్నారు. ఫలితాల రోజు నుంచి అధికార పార్టీ నాయకుల కక్ష సాధింపు చర్యలు ప్రారంభించారన్నారు. భౌతిక, ఆస్తుల దాడులు చేయడం జరుగుతోందన్నారు. పార్టీ సమావేశానికి అందరూ హాజరు కావడం ఐక్యతకు నిదర్శనమన్నారు. అధికార పార్టీ దాడుల్లో ఇబ్బంది పడిన ప్రతి ఒక్కరినీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కలుస్తారన్నారు. చిత్తూరుకు మరో నాలుగు నెలల్లో ఆయన వచ్చే అవకాశం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బంది పడినవారితో నేరుగా మాట్లాడి వారికి భరోసా కల్పించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ బాబునాయుడు, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు త్యాగరాజులు, నాయకులు సంపత్, అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌రాయల్, రజనీకాంత్, ప్రకాష్, ప్రవీణ్, వెంకటేష్‌రెడ్డి, రవి, నవీన్, సాయికృష్ణ, రవీంద్రరెడ్డి, సుధాకర్ నాయుడు, విక్టర్, చిట్టిబాబు, ఈశ్వర్‌రెడ్డి, స్వామి వేలు, కృష్ణామూర్తి, యోవాన్, డానియేల్, జయకోడి, గుణవతి, విక్టర్, మోహన్‌నాయుడు, కలైఅరసి, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఎంపీడీవో శివశంకర్



గుడిపాల: మాట్లాడుతున్న అధికారులు

బంగారుపాళెం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో సోమవారం మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డమేరియా, మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పంచాయతీ రాజ్, వైద్య, ఆరోగ్య శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పరిసరాలలో మురుగునీరు, చెత్తకుప్పలు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి పైపులు లీకేజీలు కాకుండా చూడాలని పేర్కొన్నారు. ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్, ఎంపీహెచ్‌ఈవో రమేష్‌బాబు, హెల్త్‌సూపర్‌వైజర్లు హరికృష్ణ, రమాదేవి, అముద పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఐరాల, కాణిపాకం డాక్టర్లు పూర్ణలత, స్వాతి సింధూర సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఈవోపీఆర్డీ కుసుమకుమారి ఆధ్వర్యంలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆశా వర్కర్లు గర్భిణులకు అందుబాటులో ఉండి వారికి డాక్టర్ల సలహాలను తెలియజేస్తూ తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేసిన వెంటనే క్లోరినేషన్ చేయాలన్నారు. కలుషిత నీటి ద్వారా వచ్చే కలరా, విరేచనాలు, వాంతులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు చేతులను శుభ్రంగా కడిగేలా తల్లిదండ్రులు చూసుకోవాలని సూచించారు.

గుడిపాలలో..

గుడిపాల: వర్షాకాలం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉండడంతో అందరూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంధ్య, గ్రామ పంచాయతీల విస్తరణాధికారి కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డయేరియా, డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని, ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు కాచి వడబోసిన నీటిని తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, క్లోరినేషన్ చేసిన నీటినే కొళాయిలకు సరఫరా చేయాలని ఆదేశించారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నగర పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు 1–25 డివిజన్ల, సాయంత్రం 4 గంటలకు 26–50 డివిజన్ల నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహిస్తారు. కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి కోరారు.

బిందు సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ సాగు



రైతులకు డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పిస్తున్న సతీష్

యాదమరి(పూతలపట్టు): బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేయవచ్చని ఎంఐఏవో సతీష్ తెలిపారు. ఆయన సోమవారం జంగాలపల్లెలోని రైతు జగన్నాథరెడ్డి పొలంలో అమర్చిన బిందు సేద్యం పరికరాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమ్లంతో డ్రిప్పులను ఎలా బాగుచేయాలో తెలియజేశారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రిప్ పరికరాలను అందజేస్తోందని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాధవరంలో పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 35 మంది రోగులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. అదే విధంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేయించి మందులు అందజేశారు. గ్రామాల్లో వ్యాధులు సోకకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని వివరించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని, ఐరన్ మాత్రలు వాడాలన్నారు.

బట్టువాళ్లూరులో..

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ సంధ్య కోరారు. మండలంలోని బట్టువాళ్లూరులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, సోనియా, సింధుజ పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పలు శాఖల అధికారులు సోమవారం కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి పరిచయం చేసుకున్నారు. డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, వీఆర్‌ఓల సంఘం రాష్ట్ర నాయకులు బాలాజీరెడ్డి, జిల్లా నాయకులు పద్మనాభం, చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు కలెక్టర్‌ను కలిశారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్

ప్రజల నుంచి వినతుల స్వీకరణ





చిత్తూరు అర్బన్: వినతులు స్వీకరిస్తున్న సహాయ కమిషనర్, అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అధికారులు పలు వినతులు స్వీకరించారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు వినతులను తీసుకున్నారు. ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, మెప్మా విభాగాలకు సంబంధించి పలువురు వినతులు ఇచ్చారు. వీటిపై విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని సహాయ కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 21 అర్జీలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 21 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రేషన్‌కార్డు, దారి తగదాలు, భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర సమస్యలు ఉన్నట్టు పేర్కొన్నారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆయన వీఆర్వోలను ఆదేశించారు.

అశ్వవాహనంపై శ్రీరాముడి విహారం





టి.పుత్తూరు కోదండరామాలయంలో ఉభయదారులు, భక్తుల నడుమ భక్తితో స్వామికి ఊంజల్‌సేవ, అశ్వవాహనంపై కనువిందు చేస్తున్న శ్రీరామచంద్రుడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అశ్వవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉభయదారులు సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామికి భక్తి శ్రద్ధలతో తిరుమంజనం, ఉభయకర్తలు సుబ్రమణ్యం రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. 11 గంటలకు ఉభయదారులు జయప్రకాష్‌రెడ్డి స్వామికి ఉత్సవం చేయించారు.

భక్తిప్రపత్తులతో ఊంజల్‌సేవ

కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఉభయదారులు అమరావతిరెడ్డి ఆధ్వర్యంలో స్వామికి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పుష్పాలను, పట్టువస్త్రాలను సమర్పించారు. సోమవారం రాత్రి ఉభయకర్తలు అశ్వవాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు కుప్పాలపల్లె గురుమూర్తి కుటుంబసభ్యులు స్వామికి పూజాసామగ్రి, తీర్థప్రసాదాలు, గజమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. స్వామి వారు అశ్వంపై కొలువుదీరి ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామికి ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు.

నేడు చక్రస్నానం, వసంతోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, మధ్యాహ్నం మోహినీ ఉత్సవం, సాయంత్రం ఉట్లోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, ఏకాంత సేవ నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు.

కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే నయం



మాట్లాడుతున్న డాక్టర్ మమతారాణి

పలమనేరు: కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే నయం చేసేఅవకాశం ఉంటుందని స్థానిక ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ మమతారాణి అన్నారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీ డాక్టర్లకు స్థానిక ఆస్పత్రిలో సోమవారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఒకప్పుడు కేన్సర్ అంటే మరణం తప్పదనే భయం ఉండేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. కేన్సర్‌కు పలు అత్యాధునిక వైద్య చికిత్స విధానాలు అందుబాటులో వచ్చాయని చెప్పారు. దీంతో ఏ కేన్సర్ అయినప్పటికీ ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్సతో దాని నుంచి విముక్తి పొందవచ్చన్నారు. అనంతరం వివిధ రకాల కేన్సర్లు, వాటికి చికిత్సా విధానాల గురించి ఎస్వీ కళాశాల అధ్యాపకులు, పలువురు వైద్య నిపుణులు ప్రసంగించారు.